
మారుపాక - గోవిందన్నగూడెం గ్రామాల నడుమ నిర్మించిన హైలెవల్ వంతెన

### మారుపాక -గోవిందన్నగూడెం
# హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తి

- ప్రారంభానికి సిద్ధం
- తొలుగనున్న ప్రజల కష్టాలు

నిడమనూరు, నవంబర్ 4: మండలంలోని మారుపాక –గోవిందన్న గూడెం గ్రామాల నడుమ హైలెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రానికి వెళ్లే దారిలో ఉన్న రోడ్ డ్యాం మీదుగా వర్షాల సమయంలో నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఇబ్బందులను ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 2021 సెప్టెంబర్‌లో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 2.78 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో వంతెన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. పనులు అయితే పూర్తి కాగా ప్రారంభించడమే మిగిలింది.

**సులువు కానున్న ప్రయాణం...**

ముప్పారం, ఊట్కూరు, నందికొండవారి గూడెం, గుంటిపల్లి, ఎర్రబెల్లి, మాదారం, తోరగల్లు, దుప్పలపల్లి గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి హైలెవల్ వంతెన నిర్మాణంతో ప్రయాణం సులువు కా నుంది. దశాబ్దాలుగా ఈ మార్గం గుండా జిల్లా కేంద్రానికి సమీప గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. నాగార్జునసాగర్, నల్లగొండ నియోజకవర్గాలను అనుసంధానంగా ఉండే రోడ్డు మార్గం కావడంతో ఈవంతెన నిర్మాణం ప్రతిపాదన తెరపైకి దశాబ్దాలుగా వస్తోంది. వాగుపై వంతెన నిర్మాణం పూర్తవగా వంతెనకిరువైపులా రోడ్డు నిర్మించాల్సి ఉంది.

# అడవిలో అద్భుతంగా రోడ్డు

- నల్లమలలో తీరిన రోడ్ల సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


కాచరాజుపల్లి -కంబాలపల్లి నడుమ రోడ్డు


బండకిందతండా సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద వేసిన రోడ్డు

చందంపేట, డిసెంబర్ 4 :నల్లమల అటవీ ప్రాంతంలో సరైన రోడ్డు లేక అవస్థలు పడ్డ ప్రజలకు ఆ కష్టాలు తీరాయి. స్థానిక నాయకుల విన్నపం మేరకు స్పందించిన ప్రభుత్వం ఇటీవలే నల్లమల అటవీ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించింది. ఈ మేరకు నల్లమల అటవీ ప్రాంతంలో బీటీ, సీసీ రోడ్లు వేశారు. దీంతో అటవీ ప్రాంతం కొత్త సొగసులను అద్దుకుంది. నేరెడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి నుంచి చందంపేట మండలంలోని కంబాలపల్లి, పీడబ్ల్యూడీ రోడ్డు వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. గతంలో గుంతలమయంగా ఉన్న రోడ్లతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. అటవీ అధికారులు తమ విధి నిర్వహణను గతంతో పోల్చితే ఇబ్బందులు లేకుండా పోయింది. కాచరాజుపల్లి కంబాలపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు సుమారు రూ.5కోట్లతో బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో కంబాలపల్లి, పొగిళ్ల, పాత కంబాలపల్లి, సర్కిల్‌తండా, బండమీది తండా, రేకులవలయం వాసులు ఈ రోడ్డు ద్వారా కారాజుపల్లి మీదుగా దేవరకొండకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు వేయడంతో ప్రయాణ కష్టాలు తీరాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పార్టీని మరింత పటిష్ట పర్చుకుందాం

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు

హాలియా, డిసెంబర్ 4: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయినంత మాత్రాన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ప్రజలు దూరం కావడానికి గల కారణాలను విశ్లేషించుకొని కేసీఆర్ నాయకత్వంలో పార్టీని మరింత పటిష్ట పర్చుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజాతీర్పును గౌరవించడంతో పాటు బాధ్యతాయుత ప్రతిపక్షంగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపోటములు సహజమన్నారు. ఎంపీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌కి పూర్వవైభవం తీసుకువచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

**ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి**

కొండమల్లేపల్లి: దేవరకొండలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించడానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ సీనియర్, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.


పెద్దవూర : బట్టుగూడెంలో కార్తీక మాస పూజల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు


మాల్ : గొడకొండ్లలో పడి పూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దవూర, డిసెంబర్4: మండలంలోని బట్టుగూడెం గ్రామంలోని శివాలయంలో ఘనంగా కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తలకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

**మాలధారులకు అన్నదానం**

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని సీతారామ చంద్రమౌళీశ్వర ఆలయంలోని అయ్యప్ప, అంజనేయ స్వామి అలయాల్లో సోమవారం అయ్యప్ప మాలధారులకు ఎమిరెడ్డి వెంకట్‌రెడ్డి–రాధ, అంజనేయ మాలధారులకు గంజి మల్లేష్, గంజి భాస్కర్ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలను మాలధారులు శాలువాతో సన్మానించారు. గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, వర్క పాండు, గౌర్య నాయక్, ముడావత్ శంకర్, అయ్యప్ప, ఆంజనేయ మాలధారులు పాల్గొన్నారు.

**గొడకొండ్లలో అయ్యప్ప పడి పూజ**

మాల్: చింతపల్లి మండలంలోని గొడకొండ్లలో సోమవారం గురుస్వామి మ హేందర్, తంత్రిక గురుస్వామి చంద్‌నాయర్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూ జ నిర్వహించారు. మాలధారుల భజనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయిం ది. మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జగతయ్యాచారి, మట్టయాదయ్య గౌడ్, ప్రవీణ్, జంగయ్య, పరమేష్, వెంకటేష్, లక్ష్మణ్ ఉన్నారు.

### శబరి యాత్రకు బయలుదేరిన
# అయ్యప్ప మాలధారులు


పోచంపల్లి నుంచి బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారులు

భూదాన్ పోచంపల్లి డిసెంబర్ 4 : పురపాలక కేంద్రంలో అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో గురుస్వామి గుండు శ్రీరాములు ఆధ్వర్యంన 7 మంది అయ్యప్ప మాలధారులు ఇరుముడిలు ధరించి శబరిమల యాత్రకు సోమవారం బయలుదేరారు. ఈ సందర్భంగా గణపతి హోమం, స్వామివారికి సర్వాభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామియే అయ్యప్ప శరణం అంటూ నినాదాలు మార్మోగాయి. భజనలు చేస్తూ ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ సూరపల్లి రమేష్, నాయకులు పాలది యాదగిరి, గుండు ఉప్పలయ్య, మంగళపల్లి రమేష్ ఉన్నారు.

# మల్లన్న కోసం కష్టపడ్డ కార్యకర్తలకు కృతజ్ఞతలు

**రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు అజయ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న సుంకర అజయ్‌కుమార్

మునగాల, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకోవడంతో తమ పార్టీ అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటికీ గ్రామ స్థాయి లో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. మల్లన్న ఎల్లప్పుడూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటారన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి , ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరి సీతారాములు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు లింగారెడ్డి, వీరబాబు ఉన్నారు.